క్లుప్తంగా

14న సరస్వతి విగ్రహ ప్రతిష్ట

పెనమలూరు: గంగూరు స్పిన్నింగ్ మిల్స్ ఆవరణలో సరస్వతీ అమ్మవారి ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త ఈడుపుగంటి బుచ్చిబాబు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఈ నెల 14న ఉదయం 10.15 గంటలకు శ్రీవిద్యా సరస్వతీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని తెలిపారు. 12న దేవతహోమం, 13న చండీ హోమం, చండీ పారాయణ, సాయంత్రం హారతి, మంత్రపుష్పం, తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 14న ప్రతిష్ఠ మహోత్సవం, అనంతరం అన్న సంతర్పణ చేస్తామని వివరించారు.

100 మందికి వైద్య సేవలు



గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో జాస్తి చంద్రమౌళి సదన్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఎంఎల్ఎస్ఆర్‌కె.ప్రసాద్ ప్రారంభించారు. అనంతరం గన్నవరానికి చెందిన అరవింద్ హాస్పిటల్, భారతి కంటి ఆస్పత్రి, అవ్యాన్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందన్నారు. ఈ క్యాంప్‌లో మూత్రనాళాలు, కిడ్నీ, బీపీ, షుగర్, పిల్లలు, కంటి, ఎముకల వైద్య నిపుణులు 100 మందికిపైగా రోగులకు వైద్య సేవలందించినట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వజ్రాల కృష్ణారెడ్డి, సీహెచ్.వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు దండమూడి శ్రీనివాసరావు, వై.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెనమలూరు: పనికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాక పోవటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురుకు చెందిన సుజాత కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె కుమార్తె (16) స్థానికంగా జనరల్ స్టోర్‌లో పని చేస్తుంది. అయితే ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి పనికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆమె ఆచూకీ తెలియక పోవటంతో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రిజిస్ట్రేషన్ల కోసం పోటెత్తిన లబ్ధిదారులు



గన్నవరం: మండలంలోని కేసరపల్లి గ్రామ సచివాలయానికి ఆదివారం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం లబ్ధిదారులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సచివాలయం వద్ద బారులు తీరారు. లబ్ధిదారుల సౌకర్యార్థం సెలవు రోజు కూడా ప్రభుత్వం రిజిస్ట్రేషన్లకు అనుమతించింది. దీంతో లబ్ధిదారులు భారీగా తరలివచ్చారు. వీరిని కంట్రోల్ చేయడం సచివాలయ, రెవెన్యూ సిబ్బందికి తలకుమించిన భారమైంది. అయితే వారికి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సిబ్బంది కొనసాగించారు. మిగిలిన సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది.

తీరనున్న తాగునీటి సమస్య

- కంకిపాడు పట్టణంలో రూ.2.36 కోట్లతో తాగునీటి పథకం నిర్మాణం
- చురుగ్గా సాగుతున్న పైప్‌లైను పనులు
- పూర్తవుతున్న పంప్‌హౌస్
- మార్చినాటికి తాగునీటి సరఫరాకు చర్యలు



కంకిపాడులో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

కంకిపాడు: ప్రజలకు తాగునీటి సౌకర్యాల కల్పనకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే తాగునీటి పథకం నిర్మాణం పూర్తికాగా, పైప్‌లైను విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మార్చి నాటికి తాగునీటిని సరఫరా చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో కంకిపాడు పట్టణ వాసులకు తాగునీరు సమృద్ధిగా అందనుంది.

పెరిగిన జనాభాకు అనుగుణంగా..

కంకిపాడు పట్టణం రోజు రోజుకీ విస్తరిస్తోంది. అపార్టుమెంట్ల నిర్మాణంతో జనాభా సంఖ్య పెరుగుతోంది. దీనికి అనుగుణంగా ప్రజలకు తాగునీటిని సమృద్ధిగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం, స్థానిక సంస్థలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా జల్‌జీవన్ మిషన్ నుంచి రూ.2.36 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే బ్యాంకు కాలనీ, ఎస్సీ కాలనీల్లోని తాగునీటి పథకాల ద్వారా ప్రజలకు తాగునీరు అందుతోంది.

రక్షిత పథకం నిర్మాణం పూర్తి..

జల్‌జీవన్ మిషన్ నిధులతో పట్టణంలోని పద్మావతి నగర్‌లో సామాజిక స్థలం గుర్తించి తాగునీటి పథకం నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేశారు. ట్యాంకుకు అనుసంధానంగా బోరు ఏర్పాటు చేశారు. వాటర్ ట్యాంకు నిర్వహణకు అవసరమైన పంప్ హౌస్ నిర్మాణం కూడా పూర్తయింది. మిగిలిన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే ట్యాంకుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు.



పూర్తవుతున్న పంప్‌హౌస్

పైపులైన్ల విస్తరణ..

పట్టణ ప్రజలకు సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేసేందుకు అదనంగా మరో బోరు ఏర్పాటు చేయాల్సి ఉంది. బోరు ఏర్పాటుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు తాగునీటిని ఇంటింటికీ సరఫరా చేసేందుకు ప్రధాన గ్రామంలో 9 కిలో మీటర్ల మేర పైపులైన్లను విస్తరించారు. మరో 4 కిలోమీటర్ల మేరకు జీఐ పైపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పట్టణంలో 1200 ట్యాప్ కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు, పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. తాగునీటి పథకం పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతుండటంతో రానున్న వేసవిలో నీటి ఇక్కట్లకు తెరపడినట్టే.

మార్చి నాటికి పూర్తి..

రక్షిత మంచినీటి పథకం పనులు ముమ్మరంగా చేస్తున్నాం. పైప్‌లైన్ల విస్తరణ తుది దశలో ఉంది. పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. మార్చి నాటికి తాగునీరు సరఫరా అయ్యేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

–సుబ్బారావు,
ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

బాధ్యతలు స్వీకరించిన పీఏసీఎస్ చైర్మన్లు



పునాదిపాడు పీఏసీఎస్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న వీర్ల జగపతిరావు



మంత్రి జోగి రమేష్, కేడీసీసీ చైర్‌పర్సన్ పద్మావతి సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న సతీష్‌కుమార్

కంకిపాడు: రైతులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తానని పునాదిపాడు పీఏసీఎస్ నూతన చైర్మన్ వీర్ల జగపతిరావు అన్నారు. సొసైటీ నూతన చైర్మన్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా దాసరి ప్రకాశరావు, బండారు బాలరాజు నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన జగపతిరావును రైతులు, సొసైటీ ప్రతినిధులు సత్కరించారు. జగపతిరావు మాట్లాడుతూ సొసైటీ సేవలను రైతులకు పూర్తి స్థాయిలో చేరువ చేస్తామని, రైతు సంక్షేమానికి పాటుపడతామని వివరించారు. కార్యక్రమంలో తొలుసు శ్రీనివాసరావు, గండికోట రమేష్, సాగి కోటేశ్వరరావు పలువురు రైతులు పాల్గొన్నారు.

కోలవెన్ను సొసైటీ చైర్మన్‌గా..

కంకిపాడు: కోలవెన్ను పీఏసీఎస్ చైర్మన్‌గా మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్ నియమితులయ్యారు. కోలవెన్ను సొసైటీ చైర్మన్‌గా సతీష్‌కుమార్, డైరెక్టర్లుగా నక్కా శ్రీనివాసరావు, తోకల అనిత బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మంత్రి జోగి రమేష్, కేడీసీసీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి సమక్షంలో శనివారం జరిగిన వైఎస్సార్ ఆసరా పంపిణీ సభలో బాధ్యతలు చేపట్టారు. సతీష్‌కుమార్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి పాటుపడతామన్నారు.

వైభవంగా ఆత్మార్పణ దినోత్సవం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ, విశ్వరూప దర్శనం వేడుక ఘనంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీ సాయిబాబా మందిర ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు గణపతి పూజ, 108 కలశాలతో పవిత్రనదీజలాలతో పంచామృతాభిషేకం చేశారు. అనంతరం భక్తులు వాసవీ మాతకు సహస్ర నామావళి, కుంకుమ పూజ నిర్వహించారు. అమ్మవారికి శ్రీ గణపతి, నవగ్రహ మూలమంత్ర హోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవాకార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు కె.బాబూరావు, తటపర్తి సతీష్, ఇనుగూరి సుబ్రహ్మణ్యం, చక్క లక్ష్మణరాయుడు, కొప్పవరపు సూర్యనారాయణ, నేరెళ్ల తులసీకృష్ణ, సభ్యులు పాల్గొనగా పోరంకి వాసవీక్లబ్ నవ నిర్మాణ్ క్లబ్, శ్రీ దుర్గాసాయి సేవా సంఘం సేవలు అందించారు.



శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

21న శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

గన్నవరం: మండలంలోని బుద్దవరంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు శ్రీఅభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తు, జ్యోతిష్య వేద పండితులు జంధ్యాల రాజేశ్వరశాస్త్రి నేతృత్వంలో ఈ నెల 21న ఉయదం 10.29 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిసరా గ్రామాల భక్తులు హాజరుకావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



డెంటల్ క్లినిక్ ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. పట్టణంలో డాక్టర్ బి.నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సౌమ్య రెడ్డి దంపతులు ఏర్పాటు చేసిన హ్యాపి డెంటల్ క్లినిక్‌ను మంత్రి జోగి రమేష్ ఆదివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి



కంకిపాడులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ డి.సందీప్



పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ రామారావు

కంకిపాడు: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ డి.సందీప్ హెచ్చరించారు. కంకిపాడు పోలీసుస్టేషన్‌లో రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సస్పెక్ట్, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డా, రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టినా, అల్లర్లు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 94406 27044 నంబరుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పెనమలూరు: రానున్న ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ రామారావు మాట్లాడుతూ రౌడీషీటర్లు ఎన్నికల్లో భాగస్వామ్యం కారాదని అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. రౌడీషీటర్ల జీవనశైలిలో మార్పు వస్తే రౌడీషీట్లు తొలగిస్తామని హామీ ఇచ్చారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని హెచ్చరించారు.

మురుగు సమస్యకు మోక్షం

- వెయ్యి మీటర్ల మేర డ్రైనేజీ నిర్మాణం
- లెవల్స్ సక్రమంగా నిర్మించాలని ప్రజల వినతి



పోరంకిలో నిర్మాణ దశలో ఉన్న డ్రైనేజీ

పెనమలూరు: పోరంకి గ్రామంలో డ్రైనేజీ నిర్మాణం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి ఒక పక్క ఎన్‌హెచ్ఐ ఆధ్వర్యంలో డ్రైనేజీ నిర్మాణం చేస్తున్నారు. జాతీయ రహదారి గత 10 సంవత్సరాల క్రితం పోరంకి ప్రాంతంలో 150 అడుగుల మేర విస్తరించారు. అయితే ఒక పక్క మాత్రమే డ్రేనేజీ నిర్మాణం చేసి రెండవ పక్క డ్రైనేజీ నిర్మాణం చేయలేదు. దీంతో వర్షం చినుకుపడితే మురుగు నీరు జాతీయ రహదారిపై నిలుస్తోంది. ప్రస్తుతం విజయవాడ వైపు నుంచి వచ్చే మార్గం పక్కన డ్రైనేజీ నిర్మాణం పనులు చేస్తున్నారు. జాతీయ రహదారి అభివృద్ధి ప్రణాళికలో భాగంగా తాడిగడప సెంటర్ నుంచి పోరంకి శివాలయం వరకు దాదాపు వెయ్యి మీటర్ల మేర పనులు జరుగుతున్నాయి. డ్రైనేజీ పనులకు అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగించి పనులు చేస్తున్నారు.

డ్రైనేజీ సక్రమంగా నిర్మించాలి..

డ్రైనేజీ లెవల్స్ సక్రమంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణల కారణంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు జరపటం లేదని, ఆ పనులు కూడా వెంటనే చేపట్టాలని సూచిస్తున్నారు. డ్రైనేజీల నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగించాలంటున్నారు. భవిష్యత్తులో మరలా డ్రైనేజీల ఆక్రమణలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మళ్లీ మురుగు సమస్య తలెత్తుతుందని స్థానికులు అంటున్నారు. రోడ్డుకు రెండవ పక్క గతంలోనే నిర్మాణం చేసిన డ్రైనేజీ ఆక్రమణల కారణంగా పూడుకు పోయింది. దానిని కూడా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కానూరు వద్ద పనులు చేపట్టాలి..

కానూరు పరిధిలో జాతీయ రహదారి పక్కన కూడా డ్రైనేజీ పనులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అత్యవసరంగా కామయ్యతోపు నుంచి తాడిగడప జంక్షన్ వరకు డ్రైనేజీ నిర్మాణం చాలా అవసరం. ఈ ప్రాంతంలో కూడా ఆక్రమణలు చాలా ఉన్నాయని, వాటిని తొలగించి డ్రైనేజీ పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా సచివాలయ భవనం



పురుషోత్తపట్నం గ్రామ సచివాలయం

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో పంచాయతీ కార్యాలయం ఇరుకుగా ఉండేది. ఆ స్థానంలో గ్రామ సచివాలయాన్ని రెండు అంతస్తుల భవనం విశాలంగా నిర్మించారు. సచివాలయం నిర్మిస్తున్న సమయంలో స్థానిక గ్రంథాలయంలో ఉద్యోగులు, వలంటీర్లు తాత్కాలికంగా ఉండి సేవలందించారు. ఇప్పుడు నూతన భవనం నిర్మాణం పూర్తికావటంతో గ్రామస్తులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్ని హంగులతో నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనాన్ని చూసి సిబ్బంది మురిసిపోతున్నారు. సచివాలయంలో అందించే సేవలను సొంత భవనంలో మరింత ఉత్సాహంగా నిర్వహించేందుకు సిబ్బంది సన్నద్ధం అవుతున్నారు. ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తున్నారు.

మంత్రిని కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు



మంత్రి జోగి రమేష్‌ను సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మంత్రి జోగి రమేష్‌ను నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఆదివారం కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు మాట్లాడుతూ మంత్రికి అండగా ఉంటామని, ఆయన గెలుపునకు సహకారం అందిస్తామన్నారు. యనమలకుదురులో అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాలని, వణుకూరులో జగనన్న ఇళ్ల స్థలాలు అభివృద్ధి చేయాలని సంఘ ప్రతినిధులు మంత్రికి విన్నవించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటానని మంత్రి జోగి రమేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండికట్ల సతీష్, ఈడే గోపాలకృష్ణ, రేటూరి రత్నశేఖర్, తాటికొండ ధనుంజయ, పామర్తి శ్రీనివాస్, యలమర్తి నాగభూషణం, కమలాచారి, వెంట్రప్రగడ రామమోహన్, దివి సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

మధుర స్వరాలశాల ఘంటసాల

విజయవాడ కల్చరల్: మధుర స్వరాల శాల ఘంటసాల అని పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్ అన్నారు. శ్రీ కళాభారతి, పద్మశ్రీ ఘంటసాల సంగీత కళావేదిక ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సంగీత దర్శకుడు, గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతి నిర్వహించారు. సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ ఘంటసాల సంగీత కళావేదిక ద్వారా యువతకు సంగీతంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠంవ్యవస్థాపకుడుగోళ్ల నారాయణరావు మాట్లాడు తూ కృష్ణాజిల్లా కళల కాణాచి అని పేర్కొన్నారు. సినీ చరిత్రలో కృష్ణా జిల్లా సుస్థిరమైన దన్నారు. హనుమంతరాయ గ్రంథాలయం అధ్యక్షుడు డోగిపర్తి శంకరరావు ఘంటసాల స్ఫూర్తివంతమైన జీవితం గడిపినట్లు తెలిపారు. కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత డాక్టర్ వెన్నా వల్లభరావు, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు, కళా సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్,శ్రీనివాస్ పాల్గొన్నారు.













భక్త జనసంద్రం.. మేరీమాత పుణ్యక్షేత్రం

గత మూడు రోజులుగా జరుగుతున్న మేరీమాత శతాబ్ది ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. విదేశాలతో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి లక్షలాది మంది క్రీస్తు విశ్వాసులు పుణ్యక్షేత్రానికి తరలివచ్చారు. దీంతో గుణదల కొండ భక్తజనసంద్రమైంది. ఫాదర్లు నిర్వహించిన సమష్టి దివ్యబలి పూజ కార్యక్రమంలో విశ్వాసులు పాల్గొని దైవ సందేశాన్ని ఆలకించారు. దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో మరియతల్లి స్వరూపాన్ని భక్తులు దర్శించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

● నేడు పోరంకిలో ఆసరా ఉత్సవం

పెనమలూరు: పోరంకిలో వైఎస్సార్ ఆసరా మహోత్సవం సోమవారం నిర్వహిస్తున్నట్లు మంత్రి జోగి రమేష్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎల్ఎన్ గార్డెన్స్‌లో వైఎస్సార్ ఆసరా మహోత్సవకార్యక్రమంలో డ్వాక్రామహిళలకు నామూనా చెక్కు అందజేత,సభ ఉంటుందని,డ్వాక్రా మహిళలు పార్టీ శ్రేణులు పాల్గొనాలన్నారు.